ఖమ్మం పర్యటనకు వెళుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల నాయకులు శనివారం కలిసి స్వాగతం పలికారు. అనంతరం బీఆర్ఎస్ మండల కార్యాలయంలో కవితకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 15

అనాథలైన చిన్నారులకు ప్రభుత్వం రూ.10లక్షలు అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 15 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం గోకా ఫసల్వాద్ గ్రామంలో 2017లో పిడుగు పడి తల్లిదండ్రులు (వెంకటప్ప, గోవిందమ్మ) ఇద్దరినీ కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు(పవన్, అర్చన) ప్రభుత్వం అందజేసిన రూ.10 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా పుస్తకాలను శనివారం కలెక్టర్ చాంబర్‌లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అందజేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో ప్రతి నెల వచ్చే వడ్డీని నెలవారీ ఖర్చుల కోసం వారివారి ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా సెంట్రల్ డిపార్ట్‌మెంట్ స్పాన్సర్ స్కీం ద్వారా ప్రతి నెల రూ.4వేలు కూడా వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలు బాగా చదువుకోవాలని, నోట్ బుక్స్, పెన్నులు కూడా అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, డి సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరి, పిల్లల నాన్నమ్మ బాలమ్మ ఉన్నారు.

చిన్నారులకు రూ.10లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లతోపాటు నోట్ పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్

ఈ మామిడి సీజన్.. బాటసింగారంలోనే..

- పండ్ల మార్కెట్‌కు లక్ష టన్నుల మామిడి వస్తుందని అధికారుల అంచనా
- మామిడి క్రయవిక్రయాల కోసం 2.30 లక్షల ఎస్ఎఫ్‌టీల షెడ్లు
- మామిడి నిల్వల కోసం 22 కోల్డ్ స్టోరేజీలు

రంగారెడ్డి, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ఈ మామిడి సీజన్ క్రయవిక్రయాలు జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గత రెండు సీజనలుగా బాటసింగారం వద్ద గల పండ్ల మార్కెట్‌లోనే మామిడి క్రయవిక్రయాలు జరుపుతున్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా మామిడి క్రయవిక్రయాలను ఇక్కడే జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున మామిడి పండ్లు ఈ మార్కెట్‌కు వచ్చే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రవాణా సౌకర్యం కూడా అందుబాటులో ఉండేందుకుగానూ ఓఆర్ఆర్ పక్కన ఉన్న బాటసింగారంలో ఈ పండ్ల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పండ్ల మార్కెట్‌కు ప్రతి సీజన్‌లో వచ్చే మామిడి పండ్లను ఇతర దేశాలకు కూడా ఇక్కడి నుంచే ఎగుమతి చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి మామిడిపండ్లను తీసుకు వచ్చి రైతులు ఇక్కడ క్రయవిక్రయాలు జరుపుతారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతో పాటు మామిడిపండ్లు నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజీల సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. మార్కెట్‌కు వచ్చే రైతుల కోసం ఇక్కడే తూకాల వేబ్రిడ్జిలు, బ్యాంకు సౌకర్యంతో పాటు విశ్రాంతి భవనాలు, రాత్రి సమయంలో ఉండేందుకు షెల్టర్, తాగునీటి వంటి అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు.

లక్ష టన్నులు వస్తాయని అంచనా..

బాటసింగారం పండ్ల మార్కెట్‌కు ఈ సీజనల్‌లో కూడా లక్ష టన్నుల మామిడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం ఈ మార్కెట్‌లో లక్షా ఇరవై వేల టన్నుల క్రయవిక్రయాలు జరిగాయి. దానిని దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం కూడా లక్ష టన్నుల వరకు వస్తుందని అంచనాలు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో రెండు లక్షల టన్నులు తగ్గే అవకాశమున్నందున బాటసింగారం పండ్ల మార్కెట్‌లో కూడా మామిడి ఎగుమతి తగ్గే అవకాశాలున్నట్లు అధికారులు గుర్తించారు. మార్కెట్‌కు వచ్చే లక్ష టన్నుల క్రయవిక్రయాల కోసం 2.30 లక్షల ఎస్ఎఫ్‌టీల షెడ్ల నిర్మాణం చేపట్టారు. అవసరమైతే అదనంగా మరిన్ని షెడ్లను వేసేందుకు కూడా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

22 కోల్డ్ స్టోరేజీలు సిద్ధం

రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చే మామిడిపండ్లు, కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే పాడైపోయే అవకాశముండటం వలన వాటిని నిల్వ ఉంచుకునేందుకు మార్కెటింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రైతులు మామిడి పండ్లను నిల్వ ఉంచుకునేందుకు మార్కెట్‌లో 22 కోల్డ్ స్టోరేజీలను కూడా సిద్ధంగా ఉంచారు. ఈ మార్కెట్ నుంచి దేశ, విదేశాలకు ఎగుమతులు అవుతుండటంతో అన్ని రకాల ప్యాకింగ్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం

మామిడి సీజన్‌లో పండించిన మామిడి పండ్లను క్రయవిక్రయాలు జరుపుకొనేందుకు బాటసింగారం పండ్ల మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. మార్కెట్‌కు పెద్ద ఎత్తున పండ్లు, కాయలు వచ్చే అవకాశముండటంతో వారు స్వేచ్ఛగా క్రయవిక్రయాలు జరుపుకొనే అవకాశాలు కల్పిస్తున్నాం. మార్కెట్ నిర్ణయించిన మేరకే కమీషన్ తగ్గిస్తామని, మధ్య దళారులను ఆశ్రయించవద్దు. ముఖ్యంగా రైతులు మార్కెట్‌లోనే ఉండేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం. ఇక్కడి నుంచే లావాదేవీలు జరిపేందుకు బ్యాంకును కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. బయట తూకాలు వేస్తే మోసాలు జరిగే అవకాశమున్నందున మార్కెట్‌లోనే వేబ్రిడ్జి కూడా ఏర్పాటు చేశాం. - చిలుక మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్

నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాని మడిగెలు

కోట్లు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు..

నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా పట్టించుకోని మార్కెట్ అధికారులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 : ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీకి ఆదాయం పెంచడం కోసం రూ.1.25 కోట్లతో నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భూమి పూజ చేసి నిర్మాణం పూర్తిచేయించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే ఈ నిర్మాణం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం గెలుపొందిన కాంగ్రెస్ సర్కారు ఈ మడిగెలను పట్టించుకోకుండా వృథాగా వదిలేసింది. ఇబ్రహీంపట్నంలోని సాగర్ రహదారి నుంచి బృందావన్ కాలనీకి వెళ్లేందుకు ఈ మడిగెల వెంట రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు 17 మడిగెలను నిర్మించారు. ఇవి అందుబాటులోకి తీసుకువస్తే మార్కెట్ కమిటీకి మరింత ఆదాయం పెరిగే అవకాశమున్నందున అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం

ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన 17 మడిగెలను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం. త్వరలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వీటిని ప్రారంభిస్తారు. యాక్షన్ ద్వారా మడిగెలను అలాట్ చేసి మార్కెట్‌కు ఆదాయం పెంచేందుకు కృషిచేస్తాం.
- గురునాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్

తాగునీటికి తంటాలు



మిషన్ భగీరథ నీటి కోసం ఎదురుచూస్తున్న కొర్రతండా మహిళలు

మాడ్గుల, ఫిబ్రవరి 15 : మండల పరిధిలోని కొర్రతండా గ్రామంలో మిషన్ భగీరథ మంచి నీరు రాక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మంచి నీరు లేక గ్రామ ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. సంవత్సరం నుంచి అరకొర మిషన్ భగీరథ నీరు రావడంతో ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మిషన్ భగీరథ నీరు ఐదు రోజులకోసారి వస్తుందని వాపోయారు. కేసీఆర్ పాలనలో మంచినీటి కొరత ఉండేది కాదు. కాంగ్రెస్ పాలనలో నీటి ఎద్దడి ఏర్పడిందని మండిపడ్డారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గ్రామాన్ని సందర్శించి నీటి ఎద్దడిని తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నాం

మా తండాలో మిషన్ భగీరథ మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఐదు రోజుల కోసారి వస్తాయి. అవి కూడా కొంచెం నీరు వచ్చి బంద్ అవుతాయి. తాగడానికి నీరులేక బోర్ల వద్ద నీరు తెచ్చుకుంటున్నాం. మా తండా వాసులను ప్రభుత్వం పట్టించుకొని నీరు వచ్చేలా చూడాలని కోరుతున్న.
- కొర్ర బుచ్చమ్మ, కొర్రతండా

చొరవ చూపాలి

మా తండాలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మిషన్ భగీరథ ఏఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లేపడు. ఎంపీడీవో పద్మావతికి వినతిపత్రం అందజేశాం. వారు వచ్చి తండాను సందర్శించారు. కాని సమస్య తీరలేదు. ఎమ్మెల్యే చొరవ చూపి తండాకు మిషన్ భగీరథ నీరు వచ్చేలా చేయాలి. మిషన్ భగీరథ ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నం.

- కొర్ర బాలూనాయక్, కొర్రతండా

మేమెట్లా బతకాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పందించి మా తండాకు మిషన్ భగీరథ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. తాగునీరు లేక మెమెట్లా బతకాలి సారూ..
- కొర్ర బుజ్జి, కొర్రతండా

నీటికి కటకట

- పరిగి డిపోలో చెడిపోయిన బోరు మోటర్
- వారం నుంచి ఇబ్బందులు

పరిగి, ఫిబ్రవరి 15 : టీజీఆర్‌టీసీ పరిగి డిపోలోని బోరు మోటర్ చెడిపోవడంతో వారం రోజుల నుంచి నీటి ఇబ్బందులు తలెత్తాయి. గత దశాబ్దం క్రితం వేయించిన బోరు మోటర్ వారం రోజుల క్రితం చెడిపోయింది. వెంటనే కొత్త మోటర్ ఏర్పాటు చేయించకపోవడంతో గత ఆదివారం నుంచి నీటి సరఫరా లేక ఆర్టీసీ ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

తాగునీరు అటుంచి మరుగుదొడ్లలోనూ నీరు లేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు బస్టాండ్‌కు ఇదే బోరు నుంచి కనెక్షన్ ఉండగా.. పబ్లిక్ నల్లా నుంచి కనెక్షన్ ఇచ్చి బస్టాండ్‌లో మరుగుదొడ్లకు నీటి సరఫరా జరిగేలా చూస్తున్నారు. మొక్కలు ఎండిపోయే కూడా పరిస్థితి ఏర్పడింది. పరిగి డిపోలోని గ్యారేజిలో సుమారు 40 మంది, కార్యాలయంలో, సెక్యూరిటీ కలిపి పది మందికి పైగా పనిచేస్తారు. ప్రతిరోజూ విధులకు హాజరయ్యేందుకు వచ్చి వెళ్లే ఉద్యోగులు సుమారు 200 మందికి పైగానే ఉంటారు. ఇక తాగునీటి కోసం డిపోలోనే నీటిశుద్ధి ప్లాంటు ఉండగా బోరు మోటర్ పాడవడంతో ప్లాంటు పనిచేయడం లేదు. ఉద్యోగుల కోసం శుద్ధి చేయబడిన నీటిని బయటి నుంచి తెప్పించినా సాయంత్రం వరకే అయిపోతుండడంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది వాపోతున్నారు.

మరోవైపు పరిగి డిపోలో సంస్థకు చెందిన సుమారు 40 బస్సులు ఉంటాయి. వాటిని ప్రతిరోజూ బస్సు లోపల చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించడంతోపాటు బయట నీటితో శుభ్రం చేస్తారు. వారం రోజులుగా నీటి కటకటతో అగ్నిమాపక కేంద్రం నుంచి ట్యాంకు ద్వారా రెండు రోజులకొకసారి నీరు తెప్పిస్తున్నట్లు సమాచారం. ఆ నీటిని సంపులో పోయడంతో రోజు తప్పించి రోజు బస్సులను నీటితో శుభ్రం చేస్తున్నారు. మోటర్ బాగు చేయించడం కంటే కొత్త మోటర్ బిగించాల్సిందని మెకానిక్‌లు తేల్చడంతో వెంటనే బోరు మోటార్ తెప్పించాల్సింది పోయి కొటేషన్ పంపించడం, అప్రూవల్ రావడం తదితర విషయాల్లో అధికారులు రోజుల తరబడి కాలయాపన చేస్తుండడం గమనార్హం. అసలే ఎండాకాలం, మరోవైపు 200 మందికి పైగా ఉద్యోగులు నిత్యం వచ్చి వెళ్లే ప్రదేశంలో నీరు లేక నానా యాతనలు పడుతున్నారు. ఉద్యోగుల్లో మహిళా ఉద్యోగులు సైతం అధిక సంఖ్యలో ఉంటారు. నీటి ఇబ్బంది విషయం తెలిసినా సమస్య పరిష్కారంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం సరికాదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టీసీ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు చేపట్టి కొత్త బోరు మోటర్ ఏర్పాటు చేయించి నీటి ఇబ్బందులు తీర్చాలని ఉద్యోగులు కోరుతున్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 15 : కుటుంబ సమగ్ర సర్వేలో గతంలో తమ వివరాలను నమోదు చేసుకోని వారికి ఈ నెల 16 నుంచి 28 వరకు మరొకసారి నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో శనివారం సమగ్ర కుటుంబ సర్వేపై ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజాపాలన కేంద్రాల్లో ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొననివారు ప్రజాపాలన కేంద్రానికి వెళ్లి వివరాలు తెలియజేసి ఫామ్ నింపి అధికారులకు అందజేయాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా సర్వే ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నం.040-21111111కు కాల్ చేస్తే సంబంధిత ఎన్యూమరేటర్లు నేరుగా ఇంటి వద్దకే వచ్చి కుటుంబ వివరాలను సర్వే ఫామ్‌లో నమోదు చేసుకుంటారని తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

నీటి ఎద్దడి నివారణలో కార్యదర్శుల పాత్ర కీలకం

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కేశంపేట, ఫిబ్రవరి 15 : వేసవికాలం సమీపిస్తున్నదని, వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ఆయా గ్రామాల కార్యదర్శుల పూర్తిస్థాయిలో కృషి చేయాలని మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ అబ్దుల్ బారీ, డీఆర్‌డీవో అడిషనల్ పీడీ చరణ్‌గౌతం అన్నారు. కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఆయా శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో భగీరథ డిప్యూటీ ఈఈ, డీఆర్‌డీవో అడిషనల్ పీడీ పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య పరిష్కారం కోసం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళికలు రచించుకొని వాటిని అమలు చేయాలన్నారు. గ్రామాల్లోని నల్లాల ద్వారా నీరు వృథాగా పోతున్నదని, ఈ విషయమై ఇంటి యజమానులు ఆన్ ఆఫ్ సౌకర్యం ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. నర్సరీల నిర్వహణను సరిగా చూడాలని, వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలు పనులకు వచ్చేలా చూడాలని, గతంలో జరిగిన సామాజిక సర్వేలో ఇంటికి తాళం వేసి ఉన్నవారికి ప్రభుత్వం మరోమారు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ఈ నెల 16 నుంచి 18లోపు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ కాల్ సెంటర్ 040-21111111కు ఫోన్ చేసి ఆధార్ కార్డు వివరాలు నమోదు చేయాలన్నారు. వాటిని మండల పరిషత్ అధికారికి పంపుతారని, ఆ వివరాలు ఇన్యూమరేటర్‌కు అందాక ఇంటికి వచ్చి సర్వే చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్, ఎంపీవో కిష్టయ్య, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఈ ప్రదీప్, ఏపీవో అజీజ్ అహ్మద్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాధిత రైతులతో కలిసి మాట్లాడుతున్న పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్

కులకచర్ల, ఫిబ్రవరి 15 : కొత్త తరహాలో మోసానికి పాల్పడుతూ కొంతమంది దొంగలు అప్పు ఇస్తామంటూ మాయమాటలు చెప్పి రైతుల భూములను పట్టాలు చేసుకొని వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పారిపోయిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీసులను ఆశ్రయించిన బాధితులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్లు షాద్‌నగర్, షాబాద్‌లకు చెందిన వ్యక్తులు కులకచర్ల, దోమ, గండీడ్ మండలాల్లో పర్యటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అంతారం గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు చెందిన భూమిని అప్పు ఇస్తామని చెప్పి గత నవంబర్ నెలలో వచ్చి మధ్యవర్తిగా ఒక వ్యక్తిని పరిచయం చేసుకున్నాడు. ఇంటికి పిలిపించి మార్టిగేజ్‌కు బదులు సెల్‌డీడ్ చేసుకొని డబ్బులు ఇస్తామని చెప్పి ఒక్కరూపాయి ఇవ్వకుండా ఫోర్జరీ సంతకాలతో భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరారైన రేవిరెడ్డి రత్నమ్మ, మనోజ్, గణేశ్‌లను అరెస్టు చేసి వారి పేరుపై చేసుకున్న రిజిస్ట్రేషన్ క్యాన్సల్ చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, లక్ష్మణ్, బాధిత రైతులు పాల్గొన్నారు.

ఆగని అక్రమ రవాణా

- అడ్డుకున్న రైతులు
- కేశంపేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

కేశంపేట, ఫిబ్రవరి 15 : కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో కొనసాగుతున్న అక్రమ మట్టి రవాణాను మరోమారు రైతులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత రైతు కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం గ్రామంలోని సర్వే నం.220/10/2లో సలీమా కుటుంబానికి ప్రభుత్వం అసైన్డ్ పట్టా ఇవ్వగా.. అన్నాదమ్ములు ఆ భూమిని పంచుకోవాల్సి ఉన్నది. ఒక వ్యక్తి కె.సురేశ్ అనే వ్యక్తికి తన భూమిని చదును చేసి ఇవ్వాలని రాతపూర్వకంగా ఇచ్చాడన్నారు. భూమిని రాసి ఇచ్చిన వ్యక్తితో పాటు ముగ్గురి భాగాలకు సంబంధించిన భూమిలో తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయమై పరిష్కారం కోసం సలీమా కుటుంబ సభ్యులు పలుమార్లు అభ్యంతరం తెలిపినా మట్టిని అలాగే తరలిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం మట్టిని తరలిస్తున్న టిప్పర్లను మహిళా రైతు సలీమా కుటుంబ సభ్యులు అడ్డుకున్నారన్నారు. దీంతో కోపోద్రిక్తులైన కాంగ్రెస్ పార్టీ నేతలు, సంగెం గ్రామానికి చెందిన ఇబ్రహీం, వినయ్ రెడ్డి పక్కా పథకం ప్రకారం సలీమా(48) మక్బూల్(35) సమీర్(29)పై దాడి చేశారని కన్నీటి పర్యంతమవుతున్నారు. గ్రామంలోని సర్వే నం.220/10/3లో అనుమతులు పొందామని ఒక వర్గంవారు చెబుతున్నారే కానీ అసలు అసైన్డ్ భూమికి అనుమతులెలా ఇచ్చారన్న విషయం ఇక్కడ మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సంగెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంపై మట్టిని తరలిస్తున్న వ్యక్తులు దాడి చేశారన్న విషయాన్ని తెలుసుకున్న సంగెం, అల్వాల, కొత్తపేట గ్రామాలకు చెందిన నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులను అదుపు చేసేందుకు తలకొండపల్లి పోలీసులు కేశంపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టి పోలీస్ స్టేషన్ నుంచి పంపించారు.

కొంగరకలాన్‌లో హోర్డింగ్‌లను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

అనుమతులు లేని హోర్డింగుల తొలగింపు

ఆదిబట్ల, ఫిబ్రవరి 15 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా అధికారులు శనివారం పర్యటించారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపై, ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను తొలగించారు. మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్, ఆదిబట్ల, మంగల్‌పల్లి, బొంగుళూరు, నాగార్జున సాగర్ హైవేపై హోర్డింగ్‌లను వారు తొలగించారు. ఈ సందర్భంగా ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో 89 హోర్డింగ్‌లను గుర్తించామన్నారు. అందులో అనుమతులు పొంది 80 హోర్డింగ్‌లు ఏర్పాటు చేయగా.. మరో 9 హోర్డింగ్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారన్నారు. వాటిని పూర్తిగా తొలగిస్తున్నారని పేర్కొన్నారు. 80 హోర్డింగ్‌లకు రెన్యువల్ చేయాల్సి ఉండగా ప్రభుత్వం రెన్యువల్ చేయడం ఆపివేయడంతో రెన్యువల్ కోసం ఎదురుచూస్తున్నారు. అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని కమిషనర్ తెలిపారు. వారి వెంట మున్సిపాలిటీ సిబ్బంది బిల్ కలెక్టర్ రవి, ఫీల్డ్ ఆఫీసర్ వంశీ ఉన్నారు.

అభ్యసిస్తేనే జ్ఞానం

ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 15 : జ్ఞానం వయస్సు నుంచి కాదు.. విద్య, అభ్యాసం నుంచి వస్తుందని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద మొబిలైజేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించి... పోలీస్ ప్రాథమిక శిక్షణ, నిర్వర్తించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనులపై పోలీసులు అవగాహన పెంచుకోవాలన్నారు. మాన్యువల్‌లో ఉన్న విధంగా తమ కర్తవ్య విధులను నిర్వహించడం కోసం పోలీస్ అధికారుల్లో నూతన ఉత్తేజం తీసుకురావడం, జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ అధికారులకు మొబిలైజేషన్ శిక్షణ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏఆర్ పోలీస్ అధికారులకు ప్రాథమిక శిక్షణలో ఇచ్చినటువంటి పరేడ్, ఫైరింగ్, లాఠీ డ్రిల్, మాక్ ఆపరేషన్ డ్రిల్, ఇండోర్ తదితర అంశాల పట్ల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ టీవీ హనుమంత్‌రావు, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు డేవిడ్, అంజాత్ పాషా, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.